ప్రజాశక్తి

సోమవారం 1 జులై 2024

I

అల్లూరి సీతారామరాజు

కుళాయి పైపులైను మరమ్మతులు

ప్రజాశక్తి-అనంతగిరి : మండలంలోని కొత్తూరు పంచాయతీ శివలింగాపురం, కొత్తూరు గ్రామాలలో పాడైన గుర్రైన వీధి కుళాయిల ట్యాప్, పైపులైన్లను ఆదివారం స్థానిక సర్పంచ్ సారా సీతయ్య స్వయంగా మరమ్మతులు చేపట్టారు. పైపులైన్ పాడవ్వడంతో తాగునీరు సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు సర్పంచ్ దృష్టికి తేగా, ఆయన వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టి కుళాయిల ద్వారా తాగునీరు అందించే చర్యలు చేపట్టాలరు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్.అప్పారావు, రాజు ఉన్నారు.

పైపులైన్ బాగుచేస్తున్న సర్పంచ్

అరకు కాఫీకి ప్రధాని మోడీ ప్రశంస

ప్రజాశక్తి- పాడేరు : భాంతదేశంలో ఉత్పత్తి అవుతున్న అనేక ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రశంసించారు. ఆదివారం నిర్వహించిన 111వ మన్ కీ బాత్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి జిల్లా అరుకు కాఫీ రుచికి, సువాసనకు గొప్ప ప్రసిద్ధి చెందిందన్నారు. అరుకు కాఫీ గొప్ప శిఖరాలను చేరుకోవడంలో గిరిజన సహకార సంస్థ ప్రధాన పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి ఒకసారి విశాఖపట్నంలో అరుకు కాఫీ రుచి చూశానని గుర్తుచేశారు. అల్లూరి జిల్లాలో 1.50లక్షల మంది గిరిజనులు ఆర్గానిక్ కాఫీ సాగు చేస్తున్నారన్నారు. అనేక అంతర్జాతీయ అవార్డులను సొంతం చేసుకున్న అరుకు గిరిజన కాఫీ, ఢిల్లీలో జరిగిన జి20 సదస్సులో ప్రపంచ దేశాల అధినేతల కితాబులతో మరింత ప్రాచుర్యం పొందదన్నారు.

ప్రశంసలు సరే.. భరోసా ఏదీ?

- కాఫీ రైతుల సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం
- సంఘం జాతీయ ఉపాధ్యక్షులు చిన్నబాబు

మాట్లాడుతున్న కాఫీ రైతు సంఘం నేత చిన్నబాబు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీ అరకు కాఫీ అద్భుతంగా ఉందని దేశ ప్రధాని నరేంద్ర మోడీ మన్ కీ బాత్‌లో ప్రశంసలు కురిపించారని, అంతవరకు బాగానే ఉన్నా, కాఫీ పండించే గిరిజన రైతులకు గిట్టుబాటు ధర, భరోసా కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయనిఆల్ ఇండియా కాఫీ రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గెమ్మెలి చిన్నబాబు అన్నారు. ఆదివారం ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో విలేకరులతో మాట్లాడుతూ, అరకు ఆర్గానిక్ కాఫీకి దేశ విదేశాల్లో మంచి ఖ్యాతి ఉన్నప్పటికీ, అది పండించే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2018నుంచి ఇప్పటివరకు రూ.60 కోట్లు బకాయి ఉందని, వాటి చెల్లింపులకు చర్యలు చేపట్టడం లేదన్నారు.. రైతులు అనేక ఇబ్బందులు పడి పండిస్తున్న ఆర్గానిక్ కాఫీ, మిరియాలు దళారుల బారిన పడి మోసపోతున్నారన్నారు.

ఆర్గానిక్ కాఫీ పండిస్తున్న రైతులు దళారుల మోసాలకు గురికాకుండా గిట్టుబాటు ధర కల్పించాలంటే ఐటిడిఎ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఐటిడిఎ పరిధిలో రెండు లక్ష 30 వేల మంది రైతులు కాఫీ,మిరియాలు పంటను సాగు చేస్తున్నారని, వారికి ఉచితంగా మొక్కలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

కాఫీ పంటను సాగుచేస్తున్న రైతులు ప్రమాదవశాత్తు కాఫీ తోటల్లో విష జంతువుల బారినపడి చనిపోతే వారికి ఎటువంటి బీమా సౌకర్యం లేదని, అలాగే వేసవిలో కాలిపోయిన కాఫీ, సిల్వర్‌వోక్ పంటలకు పరిహారం ఇచ్చి ఆదుకునే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కాఫీకి గిట్టుబాటు ధర ప్రకటించి కాఫీ రైతులకు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాఫీ రైతు సంఘం నాయకులు చిట్టంనాయక్ గురుమూర్తి, పాంగి నానిబాబు, గుత్తుం బుజ్జిబాబు పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ వైర్లతో పొంచి ఉన్న ప్రమాదం

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సన్నిబాబు

ప్రజాశక్తి- పెదబయలు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్, ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల వెనక ఆరు వైర్ల విద్యుత్ లైన్ వేలాడేంత ఎత్తులో ఉండడంతో ప్రమాదం పొంచి ఉందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొండా సన్నిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. పెదబయలు నుంచి ముంచంగిపుట్టు వెళ్లే విద్యుత్ లైనులోని వైర్లు భూమికి కేవలం ఆరడుగుల ఎత్తులో వేలాడు తుండడం తో అటుగా వెళ్లే ప్రజలు గానీ, మూగజీవాలు గానీ వాటికి తగిలితే విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో కిందన ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డి వల్ల వైర్లు కనబడని పరిస్థితి ఉందని, అదీగాక మేతకు వెళ్లే పశువులు, మేకలు వంటి మూగజీవాలు వీటిని తాకే ప్రమాదం ఉందన్నారు. దీనిపై పలుమార్లు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎఇఇ, లైన్ ఇన్‌స్పెక్టర్, విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి, వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేసి, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. లేకుంటే వచ్చే శుక్రవారం మీకోసంలో జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒలకు ఫిర్యాదు చేస్తామని సన్నిబాబు హెచ్చరించారు.

అందేంత ఎత్తులో వేలాడుతున్న వైర్లను చూపుతున్న సిపిఎం నేత చిన్నబాబు

హరిత హిల్ రిసార్ట్స్‌కు నోటీసుల జారీ

ప్రజాశక్తి- అనంతగిరి : ఎపి పర్యాటకశాఖ ఆధ్వర్యంలోని హరిత హిల్ రిసార్ట్స్‌లో కిచెన్ నుంచి వ్యర్థాలు, మురుగునీరు డ్రైనేజీలో వదిలేయడంపై స్థానిక సిపిఎం సర్పంచ్ గెమ్మెలి రూతు ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ డిడిఒ కార్యదర్శి శ్రీను రెడ్డి నోటీసులు జారీచేశారు. కిచెన్ వ్యర్థాలను మురుగుకాలువల్లో వదిలేయడం వల్ల దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వాటిని వేరే వైపు మళ్లించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. దీని వల్ల బాలికల పాఠశాలలోని 600 మంది విద్యార్థినులు, పిఎస్‌సి వీధివాసులు, ప్రభుత్వాసుపత్రికి వెళ్లే రోగులు, పశువైద్యశాల, జూనియర్ కాలేజీకి వెళ్లేవారంతా ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని నోటీసుల్లో పేర్కొన్నారు. మురుగు, వ్యర్థాలతో దోమలు ప్రబలే అవకాశం ఉందని, తక్షణం తగు చర్యలు చేపట్టాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

ప్రమాదభరితమైనా...
పట్టించుకోరేం..!

- కల్వర్టు మధ్యలో పడిన భారీ రంధ్రంతో పరేషాన్
- ప్రమాదాలు జరుగుతున్నా స్పందించని అధికారులు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని హుకుంపేట రోడ్డు నుంచి కామయ్యపేట రోడ్డు మీదుగా మెట్టుజోరుకు వెళ్లే రహదారిలో కల్వర్టు మధ్యలో గుంత పడి ప్రమాదభరితంగా ఉన్నా పట్టించుకోకపోవడంపై వాహనదారులు, పాదచారులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు వర్షాలు కారణంగా ఈ మార్గంలో కల్వర్టు దెబ్బతినడంతో రోడ్డు మధ్యలోనే భారీ గొయ్యి ఏర్పడింది. దీంతో ఏమాత్రం ఆదమరిచి ఆ మార్గంలో ప్రయాణించినా గోతిలో పడి గాయాలపాలవ్వడంతోపాటు వాహనాలు మరమ్మతుకు గురికావడం ఖాయమని వాహన చోదకులు, ప్రయాణీకులు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కూలిన కల్వర్టు వద్ద ప్రమాదం పొంచి ఉందని, అధికారులు,ప్రజా ప్రతినిధులు స్పందించి పైకప్పులో రంధ్రం ఏర్పడిన కల్వర్టును బాగుచేయడంతోపాటు, రోడ్డు పొడుగునా ఉన్న గోతులకు కనీసం మరమ్మతులైనా చేపట్టి పూడ్చాలని వేడుకుంటున్నారు

ఒడిశాతోపాటు అరకు, డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల్లో పలు గ్రామాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి కావడంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయని స్థానికులు అంటున్నారు. అంతేకాక అత్యంత ఎత్తైన' సీతమ్మ పర్వతంపై అధిరోహించే పర్యాటకులు, సందర్శకులు కూడా ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న రోడ్డులో కల్వర్టు పైకప్పులో గుంత ఏర్పడడంతోపాటు రహదారి ప్రయాణసంకటంగా ఉన్నా పట్టించుకోని వైనంపై ఆందోళన వ్యక్తమౌతోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ, సంబంధిత ఇతర అధికారులు, అరకు ఎమ్మెల్యే, ఎంపి, ఇతర ప్రజా ప్రతినిధులు స్పందించాలని, అధ్వానంగా ఉన్న రోడ్డును ప్రయాణయోగ్యంగా బాగుచేయించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు మధ్యలో కల్వర్టుపై ఏర్పడిన రంధ్రం

అసంపూర్తి కల్వర్టుతో అనునిత్యం అవస్థలు

జాంగుడ వద్ద అరకొరగా నిర్మించి వదిలేసిన కల్వర్టు

డుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పంచాయతీ జాంగుడ రోడ్డు కల్వర్టు అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు ఆ ప్రాంత గిరిజనులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ పనులు నామమాత్రంగా చేపట్టి వదిలేయడంతో, వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరంతా కల్వర్టుపైనే నిలిచి వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులకు గురిచేస్తోంది. కల్వర్టు,. రోడ్డు నిర్మించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఆ పంచాయతీ గిరిజనులు వాపోతున్నారు.

అధికారులు స్పందించాలి : సర్పంచ్

జంగుడ రోడ్డు కల్వర్టు నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని కొర్రాయి పంచాయతీ సర్పంచ్ పి.కొములు డిమాండ్ చేశారు. .కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ సంబంధిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల నిర్వాకం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుత వర్షాలు కురుస్తుండడంతో అసంపూర్తి కల్వర్టు వద్ద నీరంతా నిలిచిపోవడంతో ప్రమాదం పొంచిఉందన్నారు. వాహనదారులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

పోలవరం ప్రాజెక్టు జాప్యంలో
కేంద్ర ప్రభుత్వ బాధ్యతను తేల్చండి

- ముంపును శాస్త్రీయంగా నిర్ధారించాలి
- నిర్వాసితుల పునరావాసంపై శ్వేత పత్రం విడుదల చేయాలి
- ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

సమావేశంలో మాట్లాడుతున్న ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర అక్రమాలు జరిగినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్వేతపత్రంలో పేర్కొన్నారని, ఇది జాతీయ ప్రాజెక్టు కనుక డ్యామ్ నిర్మాణంలో జరిగిన అవకతవకలు, సకాలంలో నిధులివ్వకపోవడం, నిర్వాసితులను నిర్లక్ష్యం చేయడం వంటి అంశాల్లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, దాని ఆధీనంలోని సంస్థల బాధ్యతను కూడా తేల్చాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో గిరిజన సంఘం రంపచోడవరం జిల్లా అధ్యక్షులు ఈ సిరిమల్లెరెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో లోతా రామారావు మాట్లాడుతూ శ్వేతపత్రంలో కేంద్ర ప్రభుత్వం బాధ్యత గురించి ఒక్క ముక్క కూడా ప్రస్తావించకుండా దాని పాపాలను కాపాడే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేసిందని విమర్శించారు. ఎన్‌హెచ్‌పిసి, హైదరాబాద్ ఐఐటి వంటి సంస్థలు ప్రస్తావించిన సాంకేతిక అవకతవకలపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల పునరావాసంపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించాలని కోరారు. నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, పునరావాసం కల్పించడానికి తక్షణ ప్రాధాన్యతనిచ్చి నిధులు కేటాయించాలన్నారు. దశలతో నిమిత్తం లేకుండా ఒకేసారి ఆర్‌అండ్‌ఆర్ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకూ మొదటిదశ పేరుతో 20 వేలమందిని గుర్తించి అరకొర ప్యాకేజీ అమలు చేయగా.., సిపిఎం, గిరిజన సంఘాల రాష్ట్రవ్యాప్త ఉద్యమం తరువాత కాంటూరు లెక్కలు మార్చకుండానే మరో 30 వేల కుటుంబాలు చేరుస్తామని గత రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. ఈ లెక్కలకూ, శ్వేతపత్రంలోని లెక్కలకు పొంతన కుదరడం లేదని పేర్కొన్నారు. ఏళ్లు గడుస్తుంటే జనాభా, 18 ఏళ్లు దాటిన వారి సంఖ్య పెరుగుతుందని, అలాంటిది బాధితుల సంఖ్యను తగ్గించడం దారుణమన్నారు. 2022 వరదల్లో ఊళ్లకు ఊళ్లు గోదాట్లో మునిగిపోయాయని, కాఫర్‌డ్యాం నిర్మాణం అనంతరం ఎన్ని అడుగుల మేర నీరు నిలిచింది, ఎన్ని అవాసాలు మునిగిపోయాయన్నది లెక్క తీయాలని కోరారు. ఆ ప్రాతిపదికగా ముంపు గ్రామాలను ప్రకటించాల్సి ఉందని స్పష్టం చేశారు. గతంలో చేసిన కాంటూరు లెక్కలు తప్పని గోదావరి వరద ముంపు తేల్చిందని, ముంపును శాస్త్రీయంగా నిర్ధారించడానికి తిరిగి సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆగస్టు నెలలో గోదావరికి వరదలొచ్చే ప్రమాదమున్నందున, ముంపు గ్రామాల ప్రజల భద్రతకు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఆవుల ధర్మారెడ్డి, గడుతూరి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్‌లో అడ్డంగా నిలిచిన భారీ వాహనం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి నుండి చింతూరు వెళ్లే ప్రధాన రహదారి వాలమూరు గ్రామ సమీపంలోని ఘాట్ రోడ్డు సీతారాములు విగ్రహాల మలుపు వద్ద ఆదివారం ఉదయం భారీ వాహనం రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. రాజమండ్రి నుండి మారేడుమిల్లి మీదుగా చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి భారీ లోడుతో వెళ్తున్న ఈ వాహనం సాంకేతికత లోపంతో వాలమూరు గ్రామానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో భారీ మలుపు వద్ద ఆదివారం ఉదయం 9 గంటలకు నిలిచిపోయింది. దీంతో సుమారు నాలుగు గంటల పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మారేడుమిల్లి పోలీసులు నాలుగు గంటల తర్వాత రాకపోకలకు సుగమమైంది. వారం రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాహనదారులు ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. ఘాట్ రోడ్లో భారీ వాహనాలకు అడ్డుకట్ట వేయాలని పదేపదే కోరుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ఘాట్ రోడ్లో భారీ వాహనాలు రాకపోకలు నిషేధించాలని పలువురు కోరుతున్నారు.

ఘాట్ రోడ్డు మలుపు వద్ద నిలిచిపోయిన భారీ వాహనం

బోటులో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

టూరిజం ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తాం

- రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి -దేవీపట్నం

రాష్ట్రంలోని టూరిజం ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తామని ఎపి పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని పోచమ్మ గండి వద్ద పాపికొండల పర్యటన బోట్లను ఆదివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. పాపి కొండలు వెళ్లి వచ్చిన పర్యాటకులతో మాట్లాడి బోటులో సమస్యలను అడిగి తెలుకున్నారు. ఫిట్‌నెస్ లేని బోటుపై ఆరా తీశారు. అధికారులతో కలిసి నది పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం గండి పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక శాఖ అధికారులు, ప్రయివేట్ బోటు యజమానులతో చర్చించి టూరిజాన్ని మరింత పెంచుతామని చెప్పారు. నదిపై పాపికొండలు పర్యటన చేసే వాళ్లకు అవసరమైన అన్ని సేవలను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. బోటు పాయింట్ వద్ద కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్‌ను సందర్శించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రంపచోడవరం పర్యాటక ప్రాంతాల్లో గుడిసె, పాపికొండల విహార యాత్రను మరింత అభివృద్ధి చేస్తామని, పర్యాటకులు రద్దీ పెరిగితే బోట్లను పెంచుతామని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో పుష్ప సినిమా షూటింగ్ స్పాట్‌లను పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

అన్నవరం వాగు వద్ద తాత్కాలిక బ్రిడ్జి పైనుండి ప్రవహిస్తున్న వర్షపు నీరు

పొంగిన అన్నవరం వాగు

- రాకపోకలకు అంతరాయం
- బ్రిడ్జి పునర్నిర్మాణం చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్న 40 గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని శనివారం రాత్రి కురిసిన వర్షానికి కొండలపై నుండి వరద రావడంతో అన్నవరం వాగు పొంగి ప్రవహించింది. అన్నవరం వాగుపై వేసిన తాత్కాలిక బ్రిడ్జిపై నుండి వరదనీరు పొంగడంతో ఆదివారం మధ్యాహ్నం వరకు ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.

రేఖపల్లి పంచాయతీ పరిధి అన్నవరం, ఉమ్మడివరం గ్రామాల మధ్య అన్నవరం వాగుపై ఉన్న బ్రిడ్జి 2022 వరదల సమయంలో కూలిపోయింది. తరువాత ప్రభుత్వం బ్రిడ్జి పునర్నిర్మాణం చేయలేదు. అయితే వాగులో సిమెంట్ తూములుపై కాంక్రీట్ వేసి ఎత్తు తక్కువతో తాత్కాలిక బ్రిడ్జి నిర్మాణం చేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు లేకపోయినా, వర్షా కాలంలో ఎగువను ఏ మాత్రం వర్షం కురిసినా అన్నవరం వాగుపై ఉన్న తాత్కాలిక బ్రిడ్జి పైనుండి వరదనీరు పొంగి ప్రవహిస్తుంది. దీంతో ఈ వాగుకు అవతల ఉన్న 6 పంచాయతీల పరిధిలోని సుమారు 40 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి.

రెండు సంవత్సరాల క్రితం బ్రిడ్జి కూలిపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుత్నామని, తాము పడుతున్న బాధలను చూసి అధికారులెవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఆసుపత్రికి, బ్యాంకులకు, ప్రభుత్వ కార్యాలయాలకు, నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఉమ్మడివరం గ్రామస్తులు వాపోయారు. కొత్త బ్రిడ్జి నిర్మాణం చేసేవరకు ప్రజలకు అవసరాలు నిమిత్తం నాటు పడవలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ ఏడాది వర్షాలు మొదలవడంతో తమకు ఈ బాధలు తప్పేలా లేవని వాపోతున్నారు. కొత్త ప్రభుత్వమైనా చొరవ చూపి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని, అంతవరకు నాటు పడవ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వర్షంతో సీలేరు సంతకు అంతరాయం

ప్రజాశక్తి -సీలేరు : వర్షం కారణంగా ఆదివారం సీలేరు వారపు సంతకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జీకే వీధి మండలం సీలేరులో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వర్షం కురిసింది. దీంతో దూర ప్రాంతాల నుంచి గిరిజనులు వారపు సంతకు రావడానికి అనేక ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా సంతలో వ్యాపారాలు ఆశించిన స్థాయిలో జరగలేదు. సీలేరు పరిసర ప్రాంతాల నుంచి గిరిజనులు తీసుకొచ్చిన కూరగాయలు విక్రయించేందుకు నానా అవస్థలు పడ్డారు. కూనవరం, ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు, వివిధ ప్రాంతాల నుంచి కూరగాయలు సీలేరు సంతకు తీసుకొచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం తెరిపివ్వకుండా కురవడంతో ప్రజలు సరుకులు కొనుగోలు చేయడం వీలుకాలేదు. దీంతో వ్యాపారాలు డీలపడ్డాయి. వారపు సంత బోసిపోయింది.

సీలేరు కాంప్లెక్స్‌లో పలువురు ఇంజినీర్లు బదిలీ

ప్రజాశక్తి -సీలేరు

సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని పలువురు ఇంజినీర్లు బదిలీ అయ్యారు. దిగువ సీలేరు డొంకరాయి డిఈఈ సివిల్‌గా విధులు నిర్వహిస్తున్న టి.అప్పలనాయుడును సీలేరు పంపు స్టోరేజ్ ప్రాజెక్టు డిఇగా బదిలీ చేస్తూ ఏపీ జెన్కో అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మాచ్‌ఖండ్ డిఈఈగా పని చేస్తున్న రాజ్ కుమార్‌కు ఈఈగా పదోన్నతి కల్పిస్తూ సీలేరు పంపు స్టోరేజ్ ప్రాజెక్టుకు బదిలీ చేశారు. సీలేరు ఏపీ జెన్కో క్యాంప్ సెక్షన్లో పని చేస్తున్న సిహెచ్.సురేష్‌ను కూడా పంపు స్టోరేజ్ ప్రాజెక్టుకు బదిలీ చేశారు. డిఈఈ సీలేరు సెక్షన్‌లో పనిచేస్తున్న వెంకటమధును మాచ్‌ఖండ్ ప్రాజెక్టుకు బదిలీ చేస్తూ ఏపీ జెన్కో అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

టి. అప్పలనాయుడు

ప్రజాశక్తి - గీతం ఆసుపత్రి ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

- భారీగా తరలివచ్చిన ఫకీర్‌తక్యా, సమీప ప్రాంత ప్రజలు

శిబిరానికి హాజరైన రోగులు

ప్రజాశక్తి - గాజువాక

ప్రజాశక్తి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సౌజన్యంతో డాక్టర్స్ డేను పురస్కరించుకుని జివిఎంసి 86వ వార్డు పరిధి ఫకీర్ తక్యా మసీదుకు సమీపంలోని కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం తలపెట్టిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 250 మంది శిబిరానికి తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి వైద్యులు ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో నిష్ణాతులైన వైద్యులు డాక్టర్ రమణారావు, దశరథ్‌రామ్, ప్రశాంత్, సాకేత్, జోయ్, స్వప్నప్రియ, పవన్, అరవింద్, జయశ్రీ, మృదుల సేవలందించారు. రోగులను ఆత్మీయంగా పలకరించి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలను తెలియజేశారు. పిఆర్ఒ రాజశేఖర్, అసిస్టెంట్ పిఆర్ఒ శ్రీను పాల్గొన్నారు.

అందరికీ వైద్యం అందాలి : అజశర్మ

తొలుత ఈ వైద్య శిబిరాన్ని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ ప్రారంభించారు. అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తి ముద్రించిన ప్రత్యేక సంచికను గీతం మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్, ప్రొఫెసర్ డాక్టర్ రమణారావు ఆవిష్కరించారు. అక్కడ నిర్వహించిన సభలో ఎ.అజశర్మ మాట్లాడుతూ ఉచితంగా విద్య, వైద్యాన్ని అందివ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. కానీ పాలకుల తీరుతో లక్ష్యం నెరవేరడం లేదన్నారు. పెద్ద జబ్బులకు మాత్రమే ఆరోగ్యశ్రీ వర్తిస్తుండటంతో సాధారణ రోగాలతో బాధపడుతున్నవారిపై ఆర్థిక భారం పడుతోందన్నారు. చైనా వంటి దేశాల్లో అనారోగ్యంతో మనిషి చనిపోకూడదన్నది నినాదంగా ఉందన్నారు. కమ్యూనిస్టు దేశాలన్నింటిలో వైద్యానికి అధిక ప్రాధాన్యత దక్కుతోందన్నారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లయినా దేశంలో వైద్యం అందక చనిపోతున్నవారు కోకొల్లలుగా ఉన్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మరణాలు అధికంగా సంభవిస్తున్నాయని తెలిపారు.

ప్రజాశక్తి సేవలు అభినందనీయం : డాక్టర్ రమణారావు

ప్రజల కోసం ప్రజాశక్తి దినపత్రిక అందిస్తున్న సేవలు అభినందనీయమని గీతం మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్, ప్రొఫెసర్ డాక్టర్ రమణారావు అన్నారు. సమాజానికి ఉపయోగపడాలన్న తలంపుతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. గీతం ఆసుపత్రి మెరుగైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. ప్రజాశక్తితో కలిసి భవిష్యత్తులో మరిన్ని ఉపయుక్త కార్యక్రమాలు చేపడతామన్నారు.

ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జులై 1న ప్రజాశక్తి సాహితీ సంస్థ పూర్వ ఛైర్మన్ కొరటాల సత్యనారాయణ వర్ధంతి, సుప్రసిద్ధ వైద్యులు బిసి.రాయ్ జయంతి, వర్ధంతిని పురస్కరించుకుని ఈ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ప్రజాశక్తి సేవా కార్యక్రమాలను తెలియజేశారు. ప్రజాశక్తి బ్యూరో చీఫ్ ఎం.మధుసూదన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం పెద్దలు ఇమామ్ హుస్సేన్, మారన్, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, ప్రజాశక్తి సిబ్బంది పాల్గొన్నారు.

కొరటాల, రాయ్‌లకు ఘన నివాళి

శిబిరం ప్రారంభానికి ముందు సుప్రసిద్ధ వైద్యులు బిసి.రాయ్, ప్రజాశక్తి సాహితీ సంస్థ పూర్వ ఛైర్మన్ కొరటాల సత్యనారాయణ చిత్రపటాలకు అతిథులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వారి సేవలను గుర్తుచేశారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న అజశర్మ తదితరులు

ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న అజశర్మ, రమణారావు, వెంకటేశ్వరరావు తదితరులు

మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

ఆశ్రమాలకు ఎఎన్‌ఎంల మంజూరుపై హర్షం

గిరిజన సంక్షేమశాఖ మంత్రిని కలిసిన ఉపాధ్యాయ సంఘం నేతలు

ప్రజాశక్తి- పాడేరు: గిరిజన సంక్షేమం, మహిళా శిశుసంక్షేమ శాఖ రాష్ట్రమంత్రి గుమ్మడి సంధ్యారాణిని ఎపి గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం, రాష్ట్ర శాఖ నేతలు ఆదివారం సాలూరులో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు ఇటీవల ప్రభుత్వం ఎఎన్ఎం పోస్టులకు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తంచేస్తూ, మంత్రి సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని మంత్రికి గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల నేతలు వినతిపత్రం అందజేశారు. గిరిజన సంక్షేమశాఖలో మంజూరైన డిఇఒలు, డిప్యూటీ డిఇఒల పోస్టులను భర్తీ చేయాలని, ఐదవ షెడ్యూల్ ఏరియాలో జిఒ3 ప్రయోజనాలను చేకూరుస్తూ, ఐటిడిఎ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ, జిపియస్ పాఠశాలల్లో ఖాళీఉపాధ్యాయ పోస్టులను గతంలో మాదిరిగానే స్పెషల్ డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని, ఆశ్రమ పాఠశాలలను జూనియర్ కళాశాలలు అప్ గ్రేడ్ చేయాలని భాషా పండితులు, పిఇటి పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్స్‌గా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. దీనిపై గిరిజన సంక్షేమమంత్రి సానుకూలంగా స్పందించారని ఉపాధ్యాయసంఘం నేతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ సూర్యనారాయణ, జి.శేషగిరిరావు, అల్లూరి జిల్లా అధ్యక్షులు కె.నీలకంఠం, జిల్లా నాయకులు కె.నాగేశ్వరరావు, కె.చిరంజీవి, హెచ్ఎం అసోసియేషన్ నాయకులు ఎస్.పూర్ణచంద్రరావు, టి.నాగేశ్వరరావు, ప్రదీప్‌చంద్ర, గోపాలరాజు, జి.రామ్మోహన్, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

రిటైర్డు లైబ్రేరియన్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి- పెదబయలు : గ్రంథాలయాధికారిగా 31ఏళ్లపాటు సేవలు అందించి ఆదివారం ఉద్యోగ విరమణ చేసిన ఒబిలి శ్రీనివాసరావును ఆదివారం గ్రంథాలయ ఆవరణలో అభినందించి, సత్కరించారు. ఎంఇఒలు పడాల దాసు, వి.ఉషారాణి పాల్గొని మాట్లాడుతూ, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న లైబ్రేరియన్ శ్రీనివాసరావు సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. మాజీ ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి, వ్యాపారవేత్త అచ్యుతరావు నాయుడు గ్రామ సర్పంచ్ పెంటమ్మ, గ్రంథాలయాభివృద్ధికి శ్రీనివాసరావు చేసిన సేవలను కొనియాడారు కార్యక్రమంలో గుల్లిపల్లి సన్యాసినాయుడు, మురళి, సిపిఎం నేతలు వెంకన్న, గండిపడాల అప్పలరాజు, ఎల్ఐసి రమణ, అల్లు మూర్తి, ఇన్‌ఛార్జి లైబ్రేరియన్ ఎం.పద్మావతి, గ్రంథాలయ ులు వి.ఆనంద్, పివి నూకరాజు, వి.అజయ్‌కుమార్, పి.వి.రమణ, బి.సూర్యకళ, వికె శిరీష, జోగేశ్వరి, జి.తిరుమలకుమారి, వెంకటేశ్వర్లు, నరసింహం, మహేష్, లక్ష్మణరావు, పైడిరాజు, శకుంతల, గోవింద్ మల్లికార్జున, సుబ్బారావు, సందీప్, ప్రభాకర్, సత్తిబాబు, కాటపల్లి సన్యాసిరావు, మంగ, కాశీపురం సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు కొట్టాన రాంబాబు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి -అనంతగిరి : అనంతగిరి పంచాయతీ కేంద్రంలోపాటు దీని పరిధిలోని మరో 15 గ్రామాలకు స్థానిక సిపిఎం సర్పంచ్ సొమ్మల రూతు ఆదేశాల మేరకు. విద్యుత్ వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఉన్న వీధిదీపాలుగా ఉన్న ఎల్ఇడి లైట్లులో పలు పాడవ్వంతో వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రాత్రి వేళ చీకటిలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఆయా గ్రామాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఏటా రెండు సార్లు వీధిదీపాల సమస్యలపై దృష్టి పెట్టి, పాడైన వాటి స్థానే కొత్తదీపాలను ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ రూతు వెల్లడించారు. విద్యుత్ పనులపై అవగాహన ఉన్న స్థానిక యువకులు సహకరించగా, సర్పంచ్ భర్త సోమ్మల నాగులు, యువకులు జె.అప్పలరాజు. జె.బాలరాజు పాల్గొన్నారు.

మోహన్ దంపతులను సత్కరిస్తున్న గిరిజన విలేకర్లు

రిటైర్డు జిసిసి మేనేజర్‌కు సత్కారం

ప్రజాశక్తి ముంచింగిపుట్టు : మండల కేంద్రంలోని ల గిరిజన సహకార సంస్థలో సుదీర్ఘకాలం పాటు వివిధ హోదాల్లో పనిచేస్తూ ఆదివారం ఉద్యోగ విరమణ పొందిన జిసిసి మేనేజర్ చెట్టి మోహన్, సుబ్బలక్ష్మి దంపతులకు మండల గిరిజన విలేకరుల సంఘం ఆధ్వర్యంలో దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆదివారం స్థానిక కల్యాణ మండపంలో జిసిసిఎం సొసైటీ సిబ్బంది ఆధ్వర్యంలో వీడ్కోలు సభలో ఉద్యోగ విరమణ పొందిన మోహన్ దంపతులకు వీరు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎపిటిఆర్ఎ మండల అధ్యక్షుడు రెయ్యల నాగభూషణం, కార్యదర్శి కూడ మోహన్, కోశాధికారి పాంగి భాస్కరరావు, సభ్యులు గంపరాయి కోటేశ్వరరావు, కూడ అనిల్, చెండా మత్స్యరాజు, సమరెడ్డి శంకరరావు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి- పెదబయలు : నాటువైద్యం, మూఢనమ్మకాల వల్ల కలిగే నష్టాలపై ప్రజలంతా అవగాహన కలిగి వాటికి దూరంగా ఉండాలని మూఢ నమ్మకాల నిర్మూలన సంఘ ప్రతినిధులు గిరిజనులకు చైతన్యం కలిగించారు. ఆదివారం ఇటీవల అనారోగ్యం బారిన పడిన మహిళలకు నాటువైద్యం చేసేందుకు వచ్చిన బూత వైద్యుడు గొరవగాడు మహదేవ్‌తోపాటు అతని సహాయకుడు త్రినాథ్ మృతి చెందిన ఘటన చోటుచేసుకున్న పెదబయలు మండలం చుట్టుమెట్ట గ్రామాన్ని సంఘ సభ్యులు సందర్శించి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆనాడు జరిగిన ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గిరిజనులకు అనారోగ్యం చేస్తే వెంటనే వైద్యులను సంప్రదించి సరైన వైద్యం చేయించుకోవాలని, ఇలా నాటు వైద్యం, బూత వైద్యం అంటూ కాలయాపన చేస్తే ప్రాణాలమీదకు వస్తుందన్నారు.ఏజెన్సీలో ఇప్పటికే ఇలాంటివే అనేక ఘటనలు చోటుచేసుకుంటున్నాయని, వాటన్నింటిపై అవగాహన కలిగి ఉండాలని గిరిజనులకు సూచించారు. సహదేవ్, త్రినాథ్ కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఇప్పటికైనా గిరిజనులు చిల్లంగి, చేతబడి వంటి మూఢ నమ్మకాలను వీడాలని, అస్వస్థతకు గురైతే సరైన వైద్యం చేయించుకుంటేనే నయమౌతుందన్న విషయాన్ని గుర్తించాలన్నారు.దీనిపై యువత అవగాహన, చైతన్యం పొంది పెద్దలకు చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో మూఢనమ్మకాల నిర్మూలన సంఘ అధ్యక్షుడు కిల్లో రాంబాబు, సభ్యులు రామ్‌సాగర్, మామిడి రాధాభాయి, వసంత్, ఝాన్సీ రాణి, సింహాద్రి నాయుడు, రింతాడ ఉప సర్పంచ్ మడపాల సోమేష్‌కుమార్, గ్రామస్తులు కృష్ణారావు, రాములమ్మ, బాధిత కుటుంబసభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న సంఘ సభ్యులు

వెంకటరమణను సన్మానిస్తున్న సుభాన్, తదితరులు

వెంకటరమణకు సన్మానం

ప్రజాశక్తి - సీలేరు : సీలేరు కాంప్లెక్స్ పరిధి మోతుగూడెం ఏపీ జెన్కోలో ఫోర్‌మెన్‌గా పని చేసి జూన్ 30న ఉద్యోగ విరమణ చేసిన బి.వెంకటరమణను యునైటెడ్ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఆదివారం ఘనంగా సత్కరించారు. వెంకటరమణ యూనియన్ నాయకుడిగా కొనసాగారు. ఈ నేపథ్యంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎస్‌కె.సుభాన్ ఆధ్వర్యంలో సీలేరు ఏపీ జెన్కో కాంట్రాక్ట్ కార్మికులు వెంకటరమణకు పుష్పగుచ్ఛాలు అందజేసి సాలువతో సన్మానించి జ్ఞాపకం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీలేరు సిఐటియు కాంట్రాక్టర్ కార్మిక సంఘం బ్రాంచ్ ప్రెసిడెంట్ బి.లక్ష్మణ్, విష్ణు కుమార్, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

'కార్పొరేట్' మొక్కజొన్న సాగుతో

కౌలు రైతులు, వ్యవసాయ కూలీల ఉపాధికి దెబ్బ

ప్రజాశక్తి-ఎటపాక : వందల, వేల ఎకరాల్లో కార్పొరేట్ బ్రాండు మొక్కజొన్న సాగుతో కౌలు రైతులుకు, వ్యవసాయ కార్మికులకు ఉపాధి లేకుండా పోతుందని సిపిఎం మండల కార్యదర్శి ఐవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే పక్క మండలాల్లో వేల ఎకరాల్లో బాండు మొక్కజొన్న సాగు చేస్తుండడంతో అక్కడ వ్యవసాయ కూలీలకు పని దొరక్క ఎటపాక మండలంలోని నందిగామ, గౌరీదేవిపేట, గన్నవరం గ్రామాలకు కూలి పనుల కోసం ఆటోల్లో వచ్చి వెళ్తున్నారని తెలిపారు. ఇప్పుడు అదే బాండ్ మొక్కజొన్న వందల ఎకరాల్లో ఎటపాక మండలంలో సాగు చేపట్టనుండడంతో ఇక్కడ వ్యవసాయ కార్మికుల ఉపాధి దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న సన్నకారు, కౌలు రైతులకు వ్యవసాయానికి భూములు దొరకని పరిస్థితి నెలకొందన్నారు. పోలవరం ప్రాజెక్ట్ కింద ప్రభుత్వం సేకరించిన భూములకు ఎకరాకు రూ.40వేలు నుండి రూ.50వేలు వరకు కౌలు చెల్లించి సాగు చేశారని, రెండేళ్లుగా వరదలు, వైరస్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దఫా మిర్చి సాగు చేసుకుందామనే ఆలోచనలో కౌలు రైతులు ఉండగా, మే నెలలోనే కార్పొరేట్ బాండ్ మొక్కజొన్న సాగుకు పోలవరం నష్టపరిహారం పొందిన భూములను ఒక్కరే వందల ఎకరాలు కౌలుకు తీసుకున్నారని తెలిపారు. ఇప్పటివరకు అధిక కౌలు చెల్లించిన రైతులను కాదని కార్పొరేట్ వ్యవసాయానికి కౌలుకు ఇవ్వడం సరికాదని, ఈ విషయంలో భూ యజమానులు కూడా పునరాలోచించాలని కోరారు. ఒక్కరే వందల ఎకరాల్లో కార్పొరేట్ వ్యవసాయం చేయడంతో కౌలు రైతులకు భూమి లేకపోవడంతో పాటు వ్యవసాయ కార్మికులకు ఉపాధి లేకుండా పోతుందని, ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు అకిశెట్టి రాము, పులుసు బాలకృష్ణ, డేగల మాధవరావు, గద్దల హుస్సేన్ ఉన్నారు.

పౌరాణిక నాటకాలకు చేయూతనివ్వండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రతి ఒక్కరూ పౌరాణిక నాటకాలకు చేయూతనివ్వాలని కళాభారతి అధ్యక్షులు, ఎస్ఆర్‌కె ఇన్ఫ్రా ప్రాజెక్టు ఛైర్మన్ ఎంఎస్ఎన్.రాజు ఆకాంక్షించారు. శ్రీ భానోదయ నాట్యమండలి (సురభి) హైదరాబాద్ సభ్యులు సురభి 140వ వార్షికోత్సవం సందర్భంగా విశాఖపట్నం కళాభారతి వేదికగా పద్మశ్రీ సురభి బాబ్జీ కళా ప్రాంగణంలో తలపెట్టిన నాటకోత్సవాలు ఆదివారమూ కొనసాగాయి. భక్త ప్రహ్లాద నాటకం ప్రదర్శించారు. రంగసాయి నాటక సంఘం నిర్వాహకులు బాదంగీర్ సాయి నిర్వహణలో కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రేపటి తరానికి మన సంస్కృతిని అందివ్వాలన్నారు. కార్యక్రమంలో కళాభారతి కార్యదర్శి రాంబాబు, ట్రస్టీలు మల్లికా మనోజ్, రామ్‌గోపాల్, ఆంధ్రాబ్యాంక్ రిటైర్డ్ ఎజి ఎండి.నాగరాజారావు, ఆంధ్రా బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ ఎంవి.సుబ్రమణ్యం, సినీ దర్శకులు అకిరి సురేష్ పాల్గొన్నారు.

ఆలయంలో భద్రతకు చర్యలు

దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్

ప్రజాశక్తి- విఆర్.పురం

మండలంలోని శ్రీరామగిరి శ్రీసుందర సీతారామస్వామి వారి ఆలయంలో భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ ఆలయంలో వరుస చోరీల నేపథ్యంలో ఆయన ఆదివారం ఆలయాన్ని సందర్శించారు. గ్రామస్తులు, అర్చకులు, దేవాదాయ శాఖ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆలయంలో నిఘా నేత్రాలను మరమ్మతులు చేయించి విద్యుత్ లేనప్పుడు కూడా సిసి కెమెరాలు పనిచేసేలా చూడాలని, భద్రత విషయంలో ఆలయంలో రాత్రి వాచ్‌మెన్‌ను నియమించాలని, కల్యాణ మండపానికి మరమ్మతులు చేయించాలని, ఆలయంలోని వివిధ గదులకు లాకర్స్ ఏర్పాటు చేయాలని, అపహరణకు గురైన 3 వాహన విగ్రహాలను వెంటనే రికవరీ చేయించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక సర్పంచ్ పులి సంతోష్ కుమార్, సిపిఎం నాయకులు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌కు అందజేశారు. దీనికి స్పందించిన ఆయన వారం రోజుల్లో ఆలయంలో నైట్ వాచ్‌మెన్‌ను నియమించడానికి చర్యలు తీసుకుంటామని, ప్రస్తుత నిఘానేత్రాలను మరమ్మతులను చేయించి వినియోగంలోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విఆర్.పురం ఎస్ఐ నాగరాజు, ఎఎస్ఐ రాధాకృష్ణ, ఇంటిలిజెన్స్ అధికారి మహర్షి, ఆలయ తాత్కాలిక ఛైర్మన్ బాలరాజు, అర్చకులు పురుషోత్తమాచార్యులు, గ్రామ పెద్దలు సీపీఎం నాయకులు గుండెపూడి లక్ష్మణరావు, కె.కాంతారావు, నెరబోయిన రాజు, టిడిపి నాయకులు పోసిబాబు, పరంకుశం, వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ దుర్గారావు, కానిస్టేబుల్ శ్రీను, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాములోరి గుడిలో చోరీలపై విచారణ జరిపించాలి : సిపిఎం

విఆర్.పురం : శ్రీరామగిరి సుందర సీతారామస్వామి దేవాలయంలో వరుస చోరీల ఘటనలపై ప్రభుత్వం విచారణ జరిపించాలని సిపిఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు శనివారం పూజారి, దేవాదాయ శాఖ సిబ్బంది సమక్షంలో గుడిని పరిశీలించారు. దొంగతనం జరిగిన తీరును, ఏ విగ్రహాలు పోయాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ గతంలో కూడా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దొంగతనం జరిగి ఎంతో విలువైన పంచలోహ విగ్రహాలు మాయమయ్యాయని, మళ్లీ ఇప్పుడు అదే పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మరో దొంగతనం జరగడం ఆశ్చర్యంగా ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య ఆలయంలో వరుస దొంగతనాలు జరగడం, విలువైన విగ్రహాలు, వాటి వాహనాలు మాయం కావడం బాధాకరమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి విచారణ చేపట్టి దోషులను పట్టుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు. టిడిపి మండల నాయకత్వం కూడా తమ ప్రభుత్వం ద్వారా విచారణ జరిపించి నిజా నిజాలను బయటకు తీసి వారి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని, ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పులి సంతోష్ కుమార్, నాయకులు పోడియం శ్రీరామ్మూర్తి, కారం సుందరయ్య, గుండిపూడి లక్ష్మణరావు, ఆత్మకూరి కాంతారావు, ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ రేపు బాలరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న శ్రీరామగిరి సర్పంచ్ సంతోష్‌కుమార్

బంకు పెట్రోల్‌లో కలిసిన నీళ్లు

నాలుగు రోజులుగా నిలిచిపోయిన విక్రయం
ఇబ్బంది పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు పెట్రోల్ బంక్ ఇన్‌ఛార్జి నిర్లక్ష్యం, పర్యవేక్షణ కొరవడడంతో అండర్ గ్రౌండ్‌లో నిల్వ ఉంచిన పెట్రోల్‌లో నీరు కలిసిపోయింది. దీంతో మూడు రోజుల నుంచి పెట్రోల్ విక్రయం నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీలేరుతో పాటు దారకొండ, దుప్పిలివాడ, గుమ్మరేవులు, ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంత వాహనదారులకు సీలేరులోని పెట్రోల్ బంకే పెట్రోల్, డీజిల్‌కు ఆధారం. అనునిత్యం ఈ బంకులోనే పెట్రోల్, డీజిల్ కొట్టించుకుంటారు. అయితే మంచినీటికి వినియోగించే పైపులైన్ లీకై నీరు బంకు ఆవరణలోని అండర్ గ్రౌండ్‌లో ఉన్న పెట్రోల్‌లో కలిసిపోయింది. దీంతో ఈ బంకులో నాలుగు రోజుల నుంచి పెట్రోల్ విక్రయం ఆగిపోయింది. ఈ విషయంపై సిబ్బంది బంకు ఇన్‌ఛార్జి రామకృష్ణకు తెలియజేయగా, ఆయన ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని విశాఖపట్నం హెచ్‌పిసిఎల్‌కు సమాచారం అందించారు. దీంతో వెంటనే ఇంజనీర్లు సీలేరు పెట్రోల్ బంక్‌కు చేరుకొని అండర్ గ్రౌండ్‌లో నిల్వ ఉన్న పెట్రోల్‌లోకి పైపులైను ఏర్పాటు చేసి బోరింగ్ ద్వారా పెట్రోల్‌లో చేరిన నీటిని బయటకు పంపించే విధంగా చర్యలు చేపట్టారు. నాలుగు రోజుల నుంచి నీటిని ఇంధనం నుంచి వేరు చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో నీటి శాతం బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు 2,250 లీటర్ల నీటిని బయటకు తోడారు. బంకులో పెట్రోల్ అమ్మకం నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెట్రోల్ ఎప్పుడు లభిస్తుందా? అని ఎదురు చూస్తున్నారు. పెట్రోల్‌లో కలిసిన నీటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

బోరింగ్ ద్వారా పెట్రోల్ నుంచి నీటిని తీస్తున్న హెచ్‌పిసిఎల్ సిబ్బంది

బంకు ఇన్‌ఛార్జి నిర్లక్ష్యమే : వాహనదారులు

సీలేరు పెట్రోల్ బంక్ ఇన్‌ఛార్జి రామకృష్ణ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఇటువంటి సమస్యలు ఏర్పడుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. వారంలో రెండు రోజులు కూడా డ్యూటీ సక్రమంగా చేయడం లేదని, ఒకవేళ బంకుకు వచ్చినా చట్టపు చూపుగా వచ్చి వెళ్ళిపోతున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

ఎమ్మెల్యే శిరీషాదేవి దంపతులకు సన్మానం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఆమె భర్త తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు విజయభాస్కర్‌ను ఎమ్మెల్యే సొంత గ్రామం మండలంలోని తంటికొండ పంచాయతీ పరిధి గింజర్తిలో ఆదివారం పలు గ్రామాల ప్రజలు, ఉద్యోగులు సన్మానం చేశారు. తంటికొండ, ఒట్టిగడ్డ, ఎర్రంపాడు, గింజర్తి గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే దంపతులకు పూలమాలలు వేసి, దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీషాదేవి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఓట్లు వేసి గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కులమతాలకు, పార్టీలకు అతీతంగా నిష్పక్షపాతంగా కృషి చేస్తామని చెప్పారు. నియోజకవర్గం సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారాన్ని కృషి చేస్తానని తెలిపారు.

4న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారిని గడగడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఈ నెల 4న నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు అవసరమైనప్పుడల్లా సిఐటియు కార్యకర్తలు రక్తదానం చేసి వారి ప్రాణాలను నిలబెడుతున్నారన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ